సాక్షి
జగిత్యాల
బుధవారం । 12 । జూన్ । 2024



నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు భారీగా తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.



అంజన్న దర్శనానికి 3 గంటలు

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ముగుస్తుండటంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హెల్త్‌కార్డుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి



బార్ అసోసియేషన్ కార్యవర్గంతో లక్ష్మారెడ్డి

జగిత్యాలజోన్: జూనియర్ న్యాయవాదులకు హెల్త్‌కార్డుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ నిర్ణయించినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి డబ్బు లక్ష్మారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన అన్ని జిల్లాల బార్ అసోసియేషన్ ఫెడరేషన్ల సమావేశంలో అధ్యక్షులు పలు తీర్మానాలు చేశారని పేర్కొన్నారు. అన్ని జిల్లా కోర్టులో ఎస్సీ, ఎస్టీ, జువైనల్, ఫ్యామిలీ కోర్టులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ముందుగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్‌ను ప్రకటించారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా వై.కొండాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జిల్లాకు చెందిన లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు.

రైతులు పత్తి సాగులో మెలకువలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వాణి

మల్యాల: రైతులు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని, పత్తి సాగులో మెలకువలు తెలుసుకుని అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పత్తి అధిక సాంద్రతతో సాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతులు సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల కూరగాయల సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆగంతపు రవళి, ఏఓ చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, కారుణ్యకుమార్, శ్రీనివాస్, ప్రశాంత్, రైతులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

జగిత్యాల: అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందుతోందని, ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి వాణిశ్రీ అన్నారు. జిల్లాకేంద్రంలోని 42వ వార్డులోగల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. పిల్లలను అంగన్‌వాడీకేంద్రాలకు పంపించాలన్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సఖీ కో–ఆర్డినేటర్ మనీల మాట్లాడుతూ మహిళల కోసం సఖీ కేంద్రం పనిచేస్తుందని, గృహ హింస, బాల్యవివాహాల నిషేధం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై వివరిస్తారని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే 181కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సూపర్‌వైజర్లు స్వరూపరాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసనలో మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాలటౌన్: పెండింగ్ మెస్ బిల్లులు, పెంచిన వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు ఏఐటీయూసీ నాయకులు సుతారి రాములు, వెన్న మహేశ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10వేల గౌరవ వేతనం చెల్లించాలని, ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న అల్పాహారం, మెస్‌చార్జీలు విడుదల చేయాలని కోరారు. వంట నిర్వాహకులకు తహసీల్దార్‌తో గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్మికులకు యూనిఫాం, వంట పాత్రలు, వంట గ్యాస్, కోడిగుడ్లు, ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోరెక భాగ్య, సంగెం పద్మ, సరస్వతి, భూమయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.





బడి గంట మోగిన వేళ..

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- కొనసాగుతున్న 'అమ్మ ఆదర్శ' పనులు
- స్కావెంజర్లు లేక ఇబ్బందులు
- అందుబాటులో పాఠ్యపుస్తకాలు
- విద్యావలంటీర్లను నియమిస్తేనే మేలు



పాఠశాలలు 831 | విద్యార్థులు 1,61,763

జగిత్యాల: వేసవి సెలవులు ముగిశాయి. నేటినుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఎప్పటిలాగే పాఠశాలలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఆశించిన మేర రావడం లేదు. గతంలో మన ఊరు– మనబడి, మనబస్తీ–మన బడి కార్యక్రమాల కింద గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని బడులకు మరమ్మతు చేపట్టారు. కానీ.. అవి పూర్తికాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేసి పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ పనులు కూడా అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయడానికి ఇప్పటివరకు స్కావెంజర్లను నియమించలేదు. గతంలో మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేసేందుకు, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు స్కావెంజర్లు ఉండేవారు. వాటిని తొలగించినప్పటి నుంచి నిర్వహణ గాడి తప్పింది. పట్టణాల్లో మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందిని వినియోగించుకోవాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా.. సిబ్బంది కొరతతో ఎవరినీ కేటాయించలేకపోయారు. అప్పటినుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులే పరిశుభ్రత పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పుడు కూడా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకే బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

విద్యావలంటీర్లను నియమిస్తేనే మేలు

ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రాంతాల్లో గతంలో విద్యావలంటర్లను నియమించి విద్యాబోధన చేయించారు. గత ప్రభుత్వం ఆ వ్యవస్థను ఎత్తివేయడం ఇబ్బందికరంగా మారింది. సర్దుబాటు పేరిట పలు స్కూళ్లలో ఉపాధ్యాయులను నియమించినా ఆశించిన మేరకు ఫలితాలు రాలేదు. తాజాగా ప్రభుత్వం విద్యావాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నప్పటికీ ఉత్తర్వులు మాత్రం రాలేదు. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో విద్యావాలంటీర్లు ఉంటేనే స్కూళ్ల మనుగడ ఉంటుంది.

యూనిఫాంలు అంతంతే..

ప్రస్తుతం విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పూర్తిగా వచ్చినప్పటికీ యూనిఫాంలు మాత్రం ఒక జతే వచ్చాయి. ఇంకా పూర్తిస్థాయిలో కుట్టు పూర్తికాలేదు. ప్రభుత్వం యూనిఫాంలు కుట్టించే బాధ్యతను డీఆర్డీఏ విభాగానికి అప్పగించడంతో వారు మహిళాసంఘాలతో కుట్టిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి విద్యార్థికి ఒక జత అందే అవకాశాలున్నాయి. మరో జత అందించాల్సి ఉంది.

సెలవుల మూడ్‌లో విద్యార్థులు

బుధవారం నుంచి బడిగంటలు మోగనున్నాయి. సుమారు 50 రోజుల పాటు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు తొలిరోజు స్కూల్‌కు వెళ్లాలంటే కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. సెల్‌ఫోన్, టీవీలకు అతుక్కుపోయిన విద్యార్థులు తొలిరోజు అంతంత మాత్రమే హాజరయ్యే అవకాశాలున్నాయి.

బదిలీల ప్రక్రియ..

ఈనెల ఎనిమిది నుంచి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు హడావుడిగా ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ల ప్రక్రియ పూర్తయినా ఎస్జీటీల బదిలీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇది ఈనెల 30వరకు కొనసాగనుంది. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులకు కలిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్లు బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో మారుమూల మండలాలైన మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, కథలాపూర్‌లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఇందులో ఉపాధ్యాయులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే ఎస్జీటీల బదిలీల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఈనెల 19 వరకు బడిబాట నేపథ్యంలో బడి బయట ఉన్న పిల్లలను స్కూళ్లలో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులే తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు సైతం ప్రభుత్వ బడుల గురించి వివరిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకుల పాత్ర కీలకం



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్

జగిత్యాలజోన్: ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకుల పాత్ర కీలకమని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం 2024–25 జిల్లా ఆర్థిక వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి బ్యాంకర్లు రుణసదుపాయం అందించాలని సూచించారు. మార్చి వరకు వ్యవసాయ రుణాల కింద రూ.3,206 కోట్లు, వీధివ్యాపారులు 1,064 మందికి రుణాలు మంజూరు చేశామని తెలిపారు. పురోగతి సాధించని బ్యాంకులతో నిరంతరం సమీక్షించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. విద్యారుణాలు విరివిగా అందించాలని, ఇందుకు ప్రభుత్వ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రైవేటు బ్యాంకులు కొన్ని ఆశించిన స్థాయిలో పురోగతి సాధించడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన వివరాలు లేకుండా అధికారులు, బ్యాంకర్లు సమావేశానికి రావద్దని మందలించారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకట్‌రెడ్డి, యూబీఐ రీజనల్ హెడ్ అరుణ సబిత, నాబార్డ్ డీడీఎం వినీత్‌చంద్ర, ఆర్బీఐ ఎల్డీవో సాయితేజరెడ్డి, డీఆర్డీవో సంపత్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, ఎస్బీఐ ఆర్ఎం రవీంద్రసింగ్, కేడీసీసీబీ డీజీఎం పీపీ.స్వామి, టీజీబీ ఆర్ఎం రాజనరేంద్ర ఉన్నారు.

సీఎంఆర్ చెల్లించకుంటే చర్యలు

జగిత్యాల: రైస్‌మిల్లర్లు త్వరితగతిన సీఎంఆర్ చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం మిల్లర్లతో సమావేశమయ్యారు. వానాకాలం 2023–24కు సంబంధించి సీఎంఆర్ చెల్లింపులు వెంటనే చేపట్టాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బకాయి చెల్లించేందుకు ప్రభుత్వం సెప్టెంబర్ వరకు గడువు ఇచ్చిందని, ఆ లోపు చెల్లించాలని పేర్కొన్నారు. రోజువారి లక్ష్యం ప్రకారం వారి పరిధిలోని మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ దివాకర, పౌసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' సర్వే వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం చల్‌గల్‌లో సర్వే పనులను మంగళవారం పరిశీలించారు. సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి కనెక్షన్ ఇచ్చిన ఇంటి యజమాని, కుటుంబ వివరాలు, ఆధార్‌నంబర్, కులం, నల్లా ఎలా వస్తుంది..? సమస్యలున్నాయా తెలుసుకోవాలన్నారు. డీపీవో దేవరాజ్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

'నీట్' మళ్లీ నిర్వహించాలి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: 'నీట్' ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, పరీక్ష మళ్లీ పకడ్బందీగా నిర్వహించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు డిమాండ్ చేశారు. నీట్ ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ యూత్ పట్టణ అధ్యక్షుడు చెట్టే భార్గవ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో మంగళవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్‌లో 720మార్కులకు కొందరు 720 మార్కులు సాధించినట్లు ప్రకటించారని, ఈనెల చివరిలోగా ప్రకటించాల్సిన ఫలితాలను హడావుడిగా ఈనెల నాలుగునే ప్రకటించడం అనుమానాలను తావిస్తోందన్నారు. నీట్ ఫలితాల్లో మైనస్ మార్కులు ఉన్నా.. 718, 719 మార్కులు రావడమేంటని ప్రశ్నించారు. పైగా ఒకే పరీక్షా కేంద్రంలో ఎనిమిది మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని, 67 మందికి ఫస్ట్ ర్యాంకు రావడం ఇదే తొలిసారి అని తెలిపారు. అనేక అనుమానాలు కలిగిస్తున్న నీట్ ఫలితాలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు ముంజాల రఘువీర్‌గౌడ్, బీరం రాజేశ్, నాగేంద్ర, సావాన్, అర్బాజ్, కొండ్ర రాజేశ్, అరుణ్‌కుమార్, మహేశ్, అజయ్, రాహుల్, అరవింద్, ప్రణయ్, కళ్యాణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దాం

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- సాదాసీదాగా జెడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీటీసీలు



వైద్యాధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాలజోన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేద్దామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అధ్యక్షతన నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీటీసీలు పాల్గొన్నారు. ముందుగా విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, సాంఘికసంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖలపై చర్చించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పల్లె దావాఖానా, బస్తీ దావాఖానాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సలు చేయకపోవడం సరికాదని తెలిపారు. మాతాశిశు ఆసుపత్రిలో ప్రసవాల రేటు ఎందుకు తగ్గుతున్నాయంటూ వైద్యాధికారులను ప్రశ్నించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల వివరాలను తప్పనిసరిగ్గా ప్రజాప్రతినిధులకు అందించాలని సూచించారు. మనబస్తీ, మనఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అండగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, అన్ని పాఠశాలల్లో శానిటేషన్ కార్యక్రమాలు చేయాలని కోరారు. వైద్యులు నిర్లక్ష్యం వహించకుండా పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతు చేసి చివరి ఆయకట్టుకు నీరిచ్చేలా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లోని ప్రత్యేక అధికారులు గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయొద్దని పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ రఘువరణ్, స్థాయీసంఘాల చైర్మన్లు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కమల వికాసం!

- ఎంపీ ఈటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి?
- ఇప్పటికే 'బండి'కి కేంద్ర సహాయ మంత్రి పదవి
- ధర్మపురి అర్వింద్‌కు సైతం పెరగనున్న ప్రాధాన్యం
- ముగ్గురూ అసెంబ్లీలో ఓడి.. ఎంపీలుగా గెలిచినవారే..
- బీజేపీలో చేరేందుకు పలువురు నేతల ఆసక్తి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా బీజేపీ నేతలకు వరుస ఆఫర్లు దక్కుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ముగ్గురు నేతలు ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచాక పార్టీలో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఇప్పుడు వీరందరికీ అదనపు బాధ్యతలు దక్కనున్నాయి. ఇప్పటికే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా ఖాళీ కానుండటంతో ఆ పోస్టు తిరిగి ఉమ్మడి జిల్లావాసులను వరిస్తుందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా ఈ రేసులో మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముందున్నారు. అలాగే ఇదే పోస్టు కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా పోటీ పడుతున్నారు.

పార్టీ బలోపేతానికి ఈటలకు పదవి..?

బీఆర్ఎస్ నుంచి అనూహ్య పరిస్థితుల్లో బయటికి వచ్చిన ఈటలను బీజేపీ చేర్చుకుంది. 2021లో బీజేపీలో చేరిన ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఉప ఎన్నిక అప్పట్లో సంచలనం. తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించిన అత్యంత ఖరీదైన ఉప ఎన్నికగా రికార్డులకెక్కింది. ఆ దరిమిలా ఈటల రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తూనే ఉన్నారు. గతేడాది బండి అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న సమయంలోనూ ఈటల ఆ పదవి తనకు వస్తుందని ఆశించారు. కానీ, అధిష్టానం ఆ బాధ్యతలు కిషన్‌రెడ్డికి అప్పగించింది. వాస్తవానికి కేంద్ర కేబినెట్‌లోనే మంత్రి పదవి ఆశించిన ఈటలకు పొత్తుల కారణంగా సమీకరణాలు కుదరలేదు. దీంతో కాస్త నిరుత్సాహానికి గురైన ఆయన ప్రస్తుతం అధ్యక్ష పదవి కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అధిష్టానం కూడా ఈయన నాయకత్వంపై సానుకూలంగానే ఉందని సమాచారం. ఈటలకు పదవి ఇవ్వడం ద్వారా ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన నాయకులనే కాకుండా బయటి నుంచి వచ్చినవారికి కూడా సముచిత ప్రాధాన్యం కల్పిస్తారన్న సంకేతాలు ఇచ్చే యోచనలో కమలనాథులు ఉన్నారని తెలిసింది. తద్వారా పార్టీలో కొత్త నేతలను ఆకర్షించాలన్న వ్యూహం రచిస్తున్నారని సమాచారం.

అర్వింద్‌కు కూడా పార్టీ పదవి..?!

ఇటీవల కోరుట్ల శాసనసభ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన ధర్మపురి అర్వింద్ తర్వాత నిజామాబాద్ ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే. ఎంతో సీనియర్ అయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఓడించి తన సత్తా ఏంటో చాటుకున్నారు. అర్వింద్ కూడా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి లేదా జాతీయ స్థాయిలో ప్రభావవంతమైన పదవిని ఆశిస్తున్నారని తెలిసింది. వీరితోపాటు ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నాయకులకు కూడా సరైన స్థానం కల్పించే యోచనలో పార్టీ ఉందని సమాచారం.

బీజేపీలోకి పలువురు కీలక నేతలు..!

కరీంనగర్ ఎంపీ సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలు పార్టీలకు చెందిన కీలక నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ.. బీజేపీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన నేతలే కాకుండా పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, సిరిసిల్లకు చెందినవారు సైతం పార్టీలో చేరేందుకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఈనెల 15 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్నందున అవి ముగిసిన వెంటనే సంజయ్ కరీంనగర్ రానున్నారు. ఆయన వచ్చిన తర్వాత చేరికలు ఉండే అవకాశం ఉంది.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గొల్లపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రాథమిక కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. అంతకుముందు ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. మండల వైద్యాధికారి నరేశ్, సీహెచ్‌వో శ్రీధర్, సూపర్‌వైజర్లు రమేశ్, నరేందర్, శారద, లత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సులు భద్రమేనా..?

- రోడ్డెక్కాలంటే అనుమతి తప్పనిసరి
- ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సిందే..
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- జిల్లావ్యాప్తంగా 464 ప్రైవేట్ బస్సులు
- 308 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి

జగిత్యాలక్రైం: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను బస్సుల్లో ఇంటినుంచి తీసుకెళ్లి తిరిగి సాయంత్రం చేరవేస్తుంటారు. ఈ క్రమంలో ఆ బస్సులు భద్రమేనా..? అన్న సందేహం తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. దీనికి రవాణా శాఖ కొన్ని నిబంధనలు విధించింది. బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పాఠశాల యాజమాన్యాలు పర్యవేక్షించాలని, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో 464 ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు 308 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. మరో 156 బస్సులు ఫిట్‌నెస్ చేసేందుకు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 15 ఏళ్లు దాటిన బస్సులకు ఫిట్‌నెస్ ఇచ్చేందుకు రవాణా శాఖ అధికారులు నిరాకరిస్తున్నారు.

ఫిట్‌నెస్ తప్పనిసరి

గడువులోపు ప్రైవేట్ పాఠశాలల బస్సులకు యాజమాన్యాలు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఇప్పటివరకు ఆయా ప్రాంతాలకు చెందిన 308కి పైగా బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫిట్‌నెస్ ఉంటేనే బస్సులు రోడ్లపై తిప్పాలని, నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు..

ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పాఠశాల, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బస్సు సామర్థ్యం కంటే ఎక్కువగా విద్యార్థులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుంటాయి. విద్యార్థులను నేరుగా ఇంటినుంచి తీసుకెళ్లి, తిరిగి సాయంత్రం ఇంటివద్ద విడిచి పెట్టేందుకు వీలుగా బస్సులను ఏర్పాటు చేస్తున్నాయి. పట్టణ, గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చేందుకు చాలా ప్రైవేటు పాఠశాలలు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాయి. ఈ మేరకు ప్రత్యేకంగా విద్యార్థుల నుంచి రవాణా చార్జీల పేరిట వసూలు చేస్తున్నాయి.



తాటిపల్లి రవాణా శాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ కోసం వచ్చిన పాఠశాల బస్సులు

పాటించాల్సిన నిబంధనలివే..

- పాఠశాల బస్సు 15 ఏళ్ల కాలపరిమితి దాటకూడదు.
- విద్యాసంస్థల బస్సులు పసుపు రంగులోనే ఉండాలి.
- బస్సు నడిపే డ్రైవర్‌కు విధిగా హెవీ వెహికిల్ లైసెన్స్ ఉండాలి. డ్రైవర్ 60ఏళ్లలోపు ఉండాలి. బస్సు నడిపేందుకు ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- బస్సుపై కుడి ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి.
- వాహనం ఆగితే బ్లింక్ అయ్యేలా పైభాగంలో నాలుగు వైపులా అంబర్ లైట్లు ఉండాలి.
- డ్రైవర్ లైసెన్స్‌ను పాఠశాల యాజమాన్యం ఆర్టీఏ కార్యాలయంలో విధిగా అందించాలి.
- బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలి.
- కిటికీలకు అడ్డంగా మూడు కడ్డీలు ఉండాలి.
- నేల నుంచి 325 మిమీ ఎత్తులో మెట్లు, ఎక్కేందుకు హ్యాండ్ రెయిలింగ్ ఉండాలి.
- అత్యవసర ద్వారం ఉండాలి, బస్సు డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబర్లు విధిగా ఉండాలి.
- నెలకోసారి బస్సు డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలు విధిగా చేయించాలి.
- ప్రతి బస్సులో సీరియల్ నంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి.
- టీఎస్ స్కూల్ యాప్ ద్వారా విద్యాసంస్థ పేరు, డ్రైవర్, అటెండర్ పేరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్కూల్ యాప్‌లో పొందుపర్చాలి.

నిబంధనలు పాటించాల్సిందే



పాఠశాలలు, కళాశాలల యజమానులు నిబంధనలు పాటించాలి. బస్సులకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల బస్సులు రోడ్లపై తిరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కాలం చెల్లిన బస్సులను రోడ్లపై తిప్పరాదు. ఈనెల 12 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లో తనిఖీలు చేపడతాం.

– వంశీ, జిల్లా రవాణా శాఖ అధికారి

పిల్లల జీవితం.. తీర్చిదిద్దుదాం

- వ్యక్తిత్వ నిర్మాణంలో గురువు, తల్లిదండ్రుల పాత్ర కీలకం

కరీంనగర్: జీవన ప్రగతికి చదువు కీలకం.. కానీ, అదొక్కటే జీవితం కాదు.. ప్రాపంచిక జ్ఞానం, మానవ ప్రేమ, మంచిచెడుల విచక్షణ, బంధాలు, అనుబంధాలు.. ఇలా ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్నదే వ్యక్తి జీవితం. అలాంటి జీవితం బడి గోడల మధ్యే నిర్మాణం కాదు. ఇందుకు ఒక్క గురువు పాత్రే సరిపోదు.. తల్లి, తండ్రి, కుటుంబం ఇలా అందరూ కీలకమే.

గురువు



విద్యార్థికి జీవితాన్ని నేర్పించేది గురువే. పోటీ ప్రపంచంలో గట్టెక్కేవాడు విజేత. ఆ దిశగా విద్యార్థిని తీర్చిదిద్దడంలో గురువుదే బాధ్యత. మూస పద్ధతిలో కాకుండా సబ్జెక్టులతో పాటు సమాజం గురించి వినూత్న రీతిలో బోధించాలి. ప్రతి విద్యార్థిపైనా దృష్టి పెట్టాలి. సమకాలీన ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని వారు ఔపోసన పట్టాలి. వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి. అప్పుడే విద్యార్థుల ఉజ్వల భవితకు దిక్సూచి కాగలరు.

అమ్మ



వ్యక్తిత్వ నిర్మాణంలో అమ్మ పాత్ర కీలకం. ఉదయమే నిద్రలేపడం, పిల్లలకు ఇష్టమైన మెనూ సిద్ధం చేయడం, పుస్తకాలు సర్ది పాఠశాలకు పంపడం వరకు తల్లి పాత్ర క్షణం తీరికలేనిది. ఇది రొటీన్‌గా మారకుండా చిన్నారుల్ని చదువులో మమేకం చేసేందుకు వీలున్న అంశాలపై తల్లులు అవగాహన పెంచుకోవాలి. విద్యా సంబంధమైన టీవీ కార్యక్రమాలు చూడడం, పుస్తకాలు చదవడం ద్వారా వీటిని బాగా వంటబట్టించుకోవచ్చు.

నాన్న



ఉదయాన్నే లేచి పిల్లల్ని పాఠశాల వద్ద దింపి రావడమే తమ బాధ్యత అనుకునే తండ్రులు ఎంతో మంది ఉన్నారు. అవసరమైతే పుస్తకాలు, పెన్నులు కొనివ్వడాన్ని అదనపు బాధ్యతగా భావిస్తారు. సాయంత్రం పిల్ల లు ఇంటికి రాగానే తండ్రి వారితో చక్కగా సంభాషించాలి. పిల్లల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. తల్లి కుటుంబ అంశాలపై అవగాహన పెంచితే, తండ్రి పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చే తీరును నేర్పించాలి.

విద్యార్థి



ఎవరెన్ని చెప్పినా.. తమ జీవిత రథచక్రాన్ని లాగాల్సింది విద్యార్థులే. ఒక స్థాయి వచ్చాక జీవితంపై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. తనలోనూ ఒక అబ్దుల్ కలాం, ఒక సచిన్ టెండూల్కర్ ఉన్నారని నిత్యం స్ఫూర్తి పొందుతూ ఉండాలి. ఎంతటి ప్రముఖులైనా ఒక్క రోజులో ఆస్థాయికి రాలేదని గుర్తించాలి. మంచి గుణాలు కలిగితే అవకాశాలు వెన్నంటివస్తాయి. జీవితంలో పైకి ఎదగాలంటే మంచి విద్య అవసరమని గుర్తించాలి.

క్లుప్తంగా

చీకోడులో యువకుడి ఆత్మహత్యాయత్నం



కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు అతన్ని కాపాడారు. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని చీకోడు గ్రామానికి చెందిన నిమ్మల మహేశ్ కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనస్తాపానికి గురై, మంగళవారం ఇంట్లోనే ఉరి పెట్టుకున్నాడు. గమనించిన అతని భార్య పుష్పలత 100కు సమాచారం అందించింది. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, రాజు వెంటనే వచ్చి, ఉరితాడుకు వేలాడుతున్న మహేశ్‌ను కాపాడారు. అనంతరం అతనితోపాటు కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహేశ్‌ను రక్షించిన కానిస్టేబుళ్లను ఎస్సై అభినందించారు.

కారును ఢీకొన్న లారీ

- తృటిలో తప్పిన పెనుప్రమాదం



జ్యోతినగర్(రామగుండం): కారును ఓ లారీ ఢీకొట్టగా తృటిలో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి రవీంద్రనాథ్ మంగళవారం తన కుటుంబసభ్యులతో కలిసి కారులో కరీంనగర్ వైపు నుంచి గోదావరిఖనికి వస్తున్నాడు. ఇదే మార్గంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన పోతుల లక్ష్మణ్‌రావు లారీలో బెల్లంపల్లి వెళ్తున్నాడు. ఎన్టీపీసీ రామగుండం బీ–పవర్ హౌస్ డౌన్ రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అందరూ క్షేమంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని బ్లూకోల్ట్స్ పోలీసులు మల్లికార్జున్, అంజి పరిశీలించారు.

భూమి విషయంలో ఫిర్యాదులు

- ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం: భూ విక్రయం, రిజిస్ట్రేషన్ విషయంలో పరస్పర ఫిర్యాదులతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ రఘుపతి మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మాదాసు నరేశ్ సిరిసిల్లకు చెందిన రాజ్‌కుమార్ వద్ద భూమి కొనుగోలు చేశాడు. కానీ, అతను రిజిస్ట్రేషన్ చేయలేదు. తాను చెల్లించిన రూ.9.25 లక్షలు ఇవ్వాలని నరేశ్ అడగడంతో 6 నెలల్లో ఇస్తానని బాండ్ రాసిచ్చాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. డబ్బుల విషయమై తనపై దాడి చేశాడని రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పెద్దపల్లి డీటీ సస్పెన్షన్

- విధి నిర్వహణలో అలసత్వమే కారణం

సాక్షి, పెద్దపల్లి: విధుల్లో అలసత్వం వహించిన పెద్దపల్లి డీటీ కె.అజయ్‌ను సస్పెండ్ చేస్తూ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వానాకాలం 2023–24 సంవత్సరానికి గానూ సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)కు సంబంధించి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మేనేజర్‌తోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు. అయితే, పెద్దపల్లిలో మండలంలో సివిల్ సప్లయ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డీటీ అజయ్‌కి సమాచారం ఇచ్చినా హాజరు కాలేదు. ఆయనకు కేటాయించిన రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్‌ను సేకరించడంలోనూ అలసత్వం వహించడంతో సివిల్ సప్లయ్ సర్వీస్ రూల్స్ ఆధారంగా సస్పెండ్ చేశారు.

అంజన్న టెండర్లలో కాంట్రాక్టర్ల రింగ్



వేలంలో పాల్గొన్న టెండర్‌దారులు

- ఈవో, అధికారుల ముందే డబ్బుల పంపిణీ
- ఆలయ సిబ్బంది తీరుపై భక్తుల అనుమానం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో ఇటీవల నిర్వహించిన పెద్ద జయంతి ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన వివిధ రకాల ముడుపులకు మంగళవారం నిర్వహించిన టెండర్లు వివాదాస్పదంగా మారాయి. భక్తుల ఇరుముడులు, దీక్ష మాలలు, ఇరుముడి బియ్యం సేకరణకు అధికారులు టెండర్ పిలిచారు. అయితే కాంట్రాక్టర్లు రింగై అధికారుల సమక్షంలోనే డబ్బులు పంచుకున్నారు. ఈ తతంగాన్ని మీడియా వీడియో తీస్తుండడాన్ని గమనించిన అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ముందుగా రూ.2.50లక్షలు పలికిన దీక్ష మాలల టెండర్‌ను రూ.3.66 లక్షల వరకు తీసుకెళ్లారు. బియ్యం కిలోకి రూ.23, ఇత్తడి గంటలు కిలోకి రూ.440, ఎండుకుడుకలు కిలోకి రూ.70, కొబ్బరికాయలు రూ.60వేలకు కాంట్రాక్టర్లు టెండర్ దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అయితే టెండర్లు నిబంధనల ప్రకారం నిర్వహించలేదని భక్తులు అంటున్నారు. ఈవో, సంబంధిత అధికారుల కళ్లముందే కాంట్రాక్టర్లు రింగై డబ్బులు పంచుకునా.. ప్రేక్షకపాత్ర పోషించారన్న విమర్శలు వస్తున్నాయి. టెండర్‌దారుల నుంచి అధికారులకు ముందుగానే ముడుపులు ముట్టాయా..? అందుకే ఇలా నామమాత్రంగా నిర్వహించారా..? అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఈవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఇద్దరు టెండర్‌దారులు లావాదేవీల్లో భాగంగానే డబ్బులు ఇచ్చుకున్నామని తెలిపారని, అయినప్పటికీ వారిని టెండర్ నుంచి తొలగించి కొత్తగా టెండర్ పిలిచి పూర్తి చేశామని పేర్కొన్నారు. అనేక అనుమానాలు ఉన్న ఈ వ్యవహారంలో కలెక్టర్, దేవాదాయ శాఖ కమిషనర్ స్పందించి టెండర్లు రద్దు చేసి, అధికారులపై చర్యలు చేపట్టాలని అంజన్న భక్తులు అంటున్నారు. టెండర్ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు శ్రీనివాస్‌శర్మ, సునీల్, అధికారులు ఉమామహేశ్వర్, సంపత్ టెండర్‌దారులు పాల్గొన్నారు.



డబ్బులు పంచుతున్న టెండర్‌దారులు

తాళం వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

- వేలిముద్రలు సేకరించిన పోలీసులు
- రూ.70 వేలు, 4 తులాల బంగారం పోయాయంటున్న బాధితులు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలో గుర్తు తెలియని వ్యక్తులు మూడిళ్లలో చోరీకి యత్నించారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అంజయ్య, కోరం లక్ష్మీరాజం, పుప్పాల గంగరాజంల కుటుంబసభ్యులు సోమవారం రాత్రి తమ ఇళ్లకు తాళాలు వేసి, డాబాపైన నిద్రించారు. దొంగలు వాటిని పగులగొట్టి, చోరీకి యత్నించారు. అయితే, రూ.70 వేలు, 3 తులాల బంగారం చోరీ అయ్యాయని అంజయ్య, తులంపావు బంగారం ఎత్తుకెళ్లారని లక్ష్మీరాజం తెలిపారు. పోలీసులు మాత్రం దొంగలు చోరీకి ప్రయత్నించారే తప్ప ఎలాంటి విలువైన వస్తువులు పోలేదని పేర్కొన్నారు. క్లూస్ టీం సభ్యులు మంగళవారం వేలిముద్రలు సేకరించారు.

కొడిమ్యాలలోని ఇంట్లో చోరీ

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రం రామకిష్టాపూర్ రోడ్డులోని నాగుల మహేశ్ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రూ.50 వేలు, 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. వ్యక్తిగత కారణాలతో తాము వేరే ఇంట్లో ఉంటున్నట్లు పేర్కొన్నాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం సభ్యులు వచ్చి, వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

కొండాపూర్ గ్రామంలో..

మేడిపల్లి(జగిత్యాల): మండలంలోని కొండాపూర్‌కు చెందిన జంగిలి గణేశ్ ఇంట్లో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. చెప్యాల గ్రామంలోని బంధువుల ఇంట్లో కార్యక్రమానికి వెళ్లి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉందని బాధితుడు తెలిపాడు. 7 గ్రాముల బంగారం, రూ.14,500 చోరీకి గురయ్యాయని పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

ఆరెపల్లి గ్రామంలో..

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలోని ఆరెపల్లికి చెందిన మంజెడీ రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కథనం ప్రకారం.. రాజయ్య కుటుంబసభ్యులు సోమవారం రాత్రి తమ ఇంటి ఎదుట నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి, టీవీ, సెల్‌ఫోన్, రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన నడిగోట్ల శ్రీనివాస్ ఇంటి ఎదుట ఉన్న సంపు మోటార్‌ను, నడిగోట్ల లింగయ్య తన ఇంటి ఎదుట నిద్రించగా అతని సెల్‌ఫోన్ చోరీ చేశారు. బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ సీఐ వారి ఇళ్లకు వెళ్లి, పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

గడ్డికి నిప్పంటించి.. మంటల్లో కాలిపోయి

- రాయికల్‌లో రైతు మృతి

రాయికల్(జగిత్యాల): పొలంలోని గడ్డికి నిప్పంటించిన ఓ రైతు అవే మంటల్లో కాలిపోయి, మృతిచెందాడని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణానికి చెందిన తోపారపు నడ్పి భూమయ్య(70)కు స్థానిక శ్మశానవాటిక సమీపంలో రెండెకరాల పొలం ఉంది. సోమవారం అందులోని గడ్డికి నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగి, భూమయ్యకు అంటుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి చూడగా కాలిపోయిన మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్ర సంఘం నాయకులు కల్లెడ ధర్మపురి, తోపారపు రవి కోరారు.



భూమయ్య మృతదేహం

1.70 కేజీల గంజాయి పట్టివేత

మంథని: సుమారు 1.70 కేజీల గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి మంథని పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు గంజాయి కేసు వివరాలు వెల్లడించారు. మంథని బస్సు డిపో ఏరియాలో ఎస్సై వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు దుబాసి రమేశ్, లుకా పెట్రోలింగ్ చేస్తున్నారు. ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించగా తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద 1.70కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులు ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దుపపల్లికి చెందిన చకినారపు సంతోష్, పెద్దపల్లి జిల్లా మంథని సత్యసాయినగర్‌కు చెందిన పుల్లె ప్రశాంత్‌గా గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. నిందితులు, గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై, కానిస్టేబుళ్లను ఏసీపీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

తల్లిగారింటికి వెళ్తూ.. అనంతలోకాలకు

- ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో మహిళ మృతి



మణెమ్మ మృతదేహం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ మహిళ అందులోనే గుండెపోటుతో మృతిచెందింది. కాల్వశ్రీరాంపూర్ పోలీసు ల కథనం ప్రకారం.. ముత్తారం మండలంలోని ల క్కారం పంచాయ తీ పరిధి ఖాజీపల్లెకు జంగ మణెమ్మ(57) మంగళవారం త న కోడలు లతతో కలిసి కాల్వశ్రీరాంపూర్‌లోని తల్లిగారింటికి బయలుదేరింది. స్వగ్రామంలోనే గోదావరిఖని డిపోకు చెందిన కాల్వశ్రీరాంపూర్ వయా జమ్మికుంట ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యలో మణెమ్మకు గుండెపోటు రావడంతో కండక్టర్, డ్రైవర్ ఆమెను కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా రు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కి భర్త రాజిరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మణెమ్మ మృతితో స్వగ్రామం ఖాజీ పల్లె, తల్లిగారిల్లు కాల్వశ్రీరాంపూర్‌లో విషాదం నెలకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు 'భగీరథ' బాధ్యతలు సరికాదు

కరీంనగర్: అంగన్‌వాడీలకు గ్రామపంచాయతీల్లోని మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల సర్వే బాధ్యతలు అప్పగించడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య ప్రకటనలో అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో ఆచరణకు సాధ్యం కాని సర్వేలను వారికి అప్పగించి పనిభారం మోపడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో అంగన్వాడీలకు కలెక్టర్ సర్వే బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రాలకు పిల్లలు వచ్చేలా ప్రోత్సహించి ఐసీడీఎస్ పనులు మాత్రమే అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు జిల్లాలోని గ్రూప్–2, 3 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫాం, సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు జత చేసి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 98491 52516 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం, నిందితుడిని చూపుతున్న అధికారులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ.. పక్కా సమాచారంతో దేవునిపల్లిలోని బేడ బుడిగ జంగాల కాలనీలో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. వానరాశి నంబయ్య అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని సుల్తానాబాద్ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించామని, నంబయ్యపై కేసు నమోదు చేశామన్నారు. డీటీ సీఎస్‌లు శంకర్‌గౌడ్, రవీందర్‌రాథోడ్, ఎఫ్ఐలు మల్లికార్జునరావు, శ్రీనివాస్, ఎస్సై శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

మంథని ఎంపీవో సరెండర్

మంథని: ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్‌పై వేటు పడింది. తమను వేధింపులకు గురిచేస్తున్నారని మంథని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో నరేందర్ విచారణ జరిపి, నివేదిక సమర్పించారు. ఈ మేరకు కలెక్టర్ ఎంపీవోను మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో మరో అధికారిని త్వరలోనే నియమిస్తామని డీపీవో ఆశాలత తెలిపారు.

చిరుత సంచారంపై ఆరా

ఓదెల(పెద్దపల్లి): మండలంలో చిరుతపులి సంచారంపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వాయుకుమార్, బీట్ ఆఫీసర్ తిరుపతి మంగళవారం ఆరా తీశారు. ఇటీవల ఓదెల మండలంలోని గోపరపల్లె, పొత్కపల్లి, కొలనూర్ గుట్టల్లో చిరుత సంచరించిందని తెలియడంతో కాలి వేలిముద్రలను పరిశీలించారు. అవి హైనా లేదా లేపార్డ్‌క్యాట్‌వి కావచ్చొని అనుమానం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల వాసులెవరూ రాత్రిపూట బయటకు వెళ్లొద్దని సూచించారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి, పక్కన నాయకులు

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ద వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో బాసిర సంపత్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలుచేయాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో పెట్టుబడి రుణాల కోసం ఈనెల 12, 13వ తేదీల్లో బ్యాంకుల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా రైతు రుణమాఫీ చేయాలని, కల్తీ ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని కోరారు. కొంతమంది వ్యాపారులు పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముతున్నారని వెంటనే వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సరిపడా నాణ్యమైన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.వాసుదేవరెడ్డి, శీలం అశోక్, గుండేటి వాసుదేవ్, వరాల రవికుమార్, పిట్టల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్న పిల్లల పుట్టువెంట్రుకలకొచ్చి.. మృత్యుఒడికి

- వేములవాడలో గుండెపోటుతో యువకుడి మృతి
- మెడికల్ షాప్ ఎదుటే కుప్పకూలిన వైనం
- మృతుడిది జనగామ జిల్లా



వినయ్ (ఫైల్)

వేములవాడ: అన్న పిల్లల పుట్టువెంట్రుకలు తీసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ వచ్చిన ఓ యువకుడు గుండెపోటుతో మృత్యుఒడికి చేరాడు. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని 13వ వార్డు ధర్మకంచకు చెందిన బొట్ల వినయ్(23) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ నేరేడుమెట్లలో ఉంటున్నాడు. తన అన్న శివకుమార్ కూతురు, కుమారుడి పుట్టువెంట్రుకలు తీసేందుకు తల్లిదండ్రులు ఇస్తారి, లక్ష్మి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి ప్రైవేట్ వాహనంలో సోమవారం వేములవాడ చేరుకున్నాడు. అద్దె గది తీసుకొని, అందరూ కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. పిల్లల పుట్టువెంట్రుకలు తీశారు. మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. అదే సమయంలో ఛాతిలో నొప్పి వస్తోందని వినయ్ తన తల్లికి చెప్పడంతో ఆమె జండూబామ్ రాసింది. అయినా నొప్పి తగ్గకపోవడంతో మందులు తెచ్చుకుంటానని మెడికల్ షాప్‌కు వెళ్లాడు. సరిగ్గా దుకాణం ఎదుటే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు అతన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అక్కడున్న రాజన్న భక్తులు కంటతడి పెట్టారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు



క్యూలైన్లలో..



స్వామివారిని దర్శించుకుంటూ..

అంజన్న దర్శనానికి 3 గంటలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ముగుస్తుండటంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో స్నానం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. 20 వేల మందికి పైగా వచ్చారని, స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. అన్ని రకాల దర్శనాలకు టికెట్లు ఇచ్చే కౌంటర్ ఒక్కటే ఉండటంతో భారీ క్యూలైన్ ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. వాహన పూజకు భారీ వాహనాలు కొండపైకి రావడంతో ఇబ్బంది పడ్డారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, అధికారులు సునీల్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.